31

# దారులు ఎన్నయినా గమ్యం ఒక్కటే

అరుణ కాపురానికి వచ్చి అప్పటికి నెలరోజులయింది ఆమెకు సుధాకర్‌తో జీవితం వెన్నెల రాత్రుల్లో ఆకాశంలో ప్రయాణించినంత హాయిగా ఉంది. కాని ఆమె బాధంతా ఇంట్లో అత్తగారి ప్రవర్తనే. అట్లని అత్తగారు ఈశ్వరమ్మ కోడల్ని రాచి రంపాన పెట్టే మనస్తత్వ మున్న స్త్రీ కూడా కాదు. అయితే ఆమె మూఢాచారాలు, ప్రవర్తన బాధా కరంగా ఉన్నాయి

ఈశ్వరమ్మని ఛాందస భావాలు ముఖం కడుక్కోకుండా కాఫీ త్రాగకూడదు. మడి లేకుండా వంట చేయకూడదు మధ్యాహ్నం నిద్ర పోకూడదు. అత్తమామలు, భర్త ఎదురుగా కుర్చీలోగాని, మంచంమీద కాని కూర్చోగూడదు. పగలు మ్యాట్నీలకు వెళ్ళకూడదు. ఇవీ ఆమె నిబంధనలు.

అయితే అరుణ పెరిగిన పరిస్థితులు, అలవాట్లు ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఆమె చిన్నతనం నుంచి స్వేచ్ఛగా స్వంత ఆలోచనలతో పెరిగింది. ఆమె తల్లిదండ్రులు కూడా ఆధునికులు కావడంతో కూతురు భావాలను తామూ గౌరవించే వాళ్ళు, ఆమె డిగ్రీ పూర్తి కాగానే సుధాకర్‌తో పెళ్ళి చూపులు జరగడం, ఇరువర్గాలవారికి ఒకరి కొకరు నచ్చి వారి వివాహం కావడం వెంటవెంటనే జరిగి పోయాయి.

అరుణ కాపురానికొచ్చిన రెండవరోజే వంట చేయబోతే మడి కట్టు కొని వంట చేయాలని ఆమె అత్తగారు ఆంక్ష విధించారు. అరుణకు ఆ తడి, మడి సరిపడక మొదటి రోజుకే జ్వరం తెచ్చుకొంది. దాంతో వంట

పని తానే తీసుకొంది ఈశ్వరమ్మ. అయితే అరుణ ఖాళీగా వుండేదికాదు. ఇంట్లో అందరి బట్టలూ ఉతికేది. శుభ్రంగా ఐరన్‌చేసి పెట్టేది ఆ పనులతో కాలక్షేపం చేస్తూ, ఇంకోవైపు అత్తగారికి తెలియకుండా ఉద్యోగాలకు అప్లికేషన్‌లు వేస్తూ వుంది. మామగారు శరభయ్య మాత్రం దేనికీ ఉలికిపడేవాడు కాదు. పలికేవాడు కాదు. అతను ఇంట్లో వున్నా లేనట్లే ఉండేది. అరుణకు తన పుట్టింట్లో బెడ్‌మీదకేకాఫీ త్రాగిగానీ క్రింద అడుగు పెట్టే అలవాటు లేదు దాంతో సుధాకర్ తప్పనిసరి అయి చీకటి తోనే ప్లాస్కు చేతబట్టుకొని వీధి సెంటరులోని హోటలుకు వెళ్ళి రెండు కప్పులు కాఫీ పట్టించుకొని వచ్చేవాడు. భార్యను లేపి. వెరొక కాఫీ త్రాగే వారు. భర్త చర్యలకు అరుణ మనస్సు కృతజ్ఞతతో నిండి పోయేది. ఒక రోజు ఈ విషయంలో ఈశ్వరమ్మ కొడుకుమీద అరవడంతో క్రమేణా తన బెడ్ కాఫీ అలవాటు మానుకొంది అరుణ.

ఆ రోజు సాయంత్రం అరుణ పట్టుచీర, జాకెట్టుతో తలనిండా మల్లెపూలు పెట్టుకొని వీధివాకిట్లో నిలబడి భర్త కోసం ఎదురుచూస్తూ వుంది.

ఇంతలో ఇంటిగడపలోకొచ్చిన ఈశ్వరమ్మ పెద్దగా పిలిచింది. "అమ్మాయ్ ఇలారా" అంటూ.

"ఏమిటి అత్తయ్యా" అంటూ వచ్చింది అరుణ ఏదో అర్జంటుపని పడిందనుకొని.

"ఎందుకమ్మా అరగంట నుంచి అలా వీధిలో నిలబడి చూస్తున్నావ్" అంది కొంత కర్కశంగా.

ఆమె మాటల్లోని కఠినత్వానికి అరుణ హృదయం బాధగా మూలిగింది.

"ఆయన కోసం ఎదురుచూస్తున్నానత్తయ్యా" అంది ఎంతో సహనం తెచ్చి పెట్టుకొని.

"వీధిలో ఉన్నా, ఇంట్లో ఉన్నా వాడె లాగూ ఇంటికే కదమ్మా వచ్చేది. ఎందుకలా వీధిలో నిలబడడం, లేనిపోని పేచీలు తెచ్చిపెట్టడం".

ఆ మాటలకు, ఆ మాటల్లోని అంతరార్థానికి అరుణ చలించి పోయింది. తనా కొత్తకోడలు, కాపురానికొచ్చి నెలే ఇప్పుడే ఈమెతో ఎందుకు తగాదా. ఇటువంటి వాటికోసమే గోడదగ్గర నిలుచొని పొంచి చూసే అమ్మలక్కలు దీన్ని చిలవలు పలవలుగా అల్లి అత్తాకోడళ్ళ తగాదాను మిగతా వాళ్ళకు ఆనందంగా చెప్పి తృప్తి పడుతుంటారు.

ఈ అవకాశం ఇతరులకు ఇవ్వకూడదనే ఉద్దేశ్యంతోనే అరుణ రాబోయే ఏడుపును బిగపట్టుకొని, కారే కన్నీటిని తుడుచుకొనే ప్రయత్నం చేయకుండానే విసవిసానడచి బెడ్ రూములోకి వెళ్ళి మంచంమీద వాలి పోయింది. ఆమె మనసు తీరంతాకిన తుఫానులా హోరుపెడుతోంది.

ఇలా ఒకటొకటిగా జరిగే సంఘటనలు ఆమెకు అత్తగారిపై ద్వేషాగ్నిని రగల్చసాగాయి. ఈరోజు తనేం తప్పుచేసింది. సుధాకర్ సినిమాకు వెళదామంటే అతనుచెప్పినట్లు తయారై రెడీగా వుంది. దానికే ఈశ్వరమ్మ తానేదో వీధిలో నిలబడి చేయరానిపని చేస్తున్న అర్థం వచ్చేలా మాట్లాడింది. ఛ...ఛ...అనుకొంది.

ఇంతలో సుధాకర్ స్కూటర్ వీధిలో ఆగింది సుధాకర్ స్కూటరును ఇంట్లోకి తీసుకురాకుండానే వీధిలో లాక్‌చేసి "అరూ...అరూ..." అని అరుస్తూ లోపలికి వచ్చాడు.

వరండాలోనే ఎదురయింది ఈశ్వరమ్మ.

"ఏమిట్రా ఆ గావుకేకలు" అంటూ కోప్పడింది.

"గావుకేకలు కాదమ్మా, ప్రేమ అరుపులు. అరుణను రెడీయై వీధిగేట్లో నిలబడమని చెప్పాను. చూసావా అమ్మా! సినిమాకి యింకా పదినిమిషాలే ఉంది నేనిప్పుడు లోపలికి రావడంవల్ల ఓ అయిదు నిముషాలు వేస్టయిపోయాయి" అన్నాడు బాధగా.

ఈశ్వరమ్మ ఏదో చెప్పబోయేలోగా లోపలికి వెళ్ళిపోయాడు సుధాకర్. లోపలికి వెళ్ళిన రెండు నిముషాలకు తిరిగి వచ్చి హడావుడిగా వీధిలోకి నడిచాడు.

"ఏమిట్రా ఏమయింది" అంది ఈశ్వరమ్మ.

"తలనొప్పట, కణతలు రుద్దుకొంటూ. మంచం మీద పొర్లుతోంది. టాబ్లెట్ కోసం వెల్తున్నాను" గబగబా చెప్పి వీధిలోని స్కూటరు స్టార్టు చేసాడు.

ఈశ్వరమ్మ క్షణం ఆలస్యం చేయలేదు. ఇంట్లోకి వెళ్ళి ఒక పళ్ళెంలో కుంకుమ, నిమ్మకాయ, ఇంకా ఏవేవో పెట్టి, ఓ విస్కీగ్లాసులో పసుపు కలిపిన నీళ్ళను ఉంచుకొని పళ్ళెంలో పెట్టుకొని అరుణ గదిలోకి వచ్చింది.

"అరుణా లేమ్మా" అంది. ఆమె కంఠంలో బాధ వుంది.

అరుణ తన గదిలోకి వచ్చిన అత్తయ్యను చూసి ఉలిక్కిపడి లేచి నిలబడింది. ఈశ్వరమ్మ తను తెచ్చిన చాపక్రిందపరచి అరుణను పద్మాసనం వేసుకొని దానిమీద కూర్చోమంది. అరుణకు ఏమీ అర్థంగాక ఆమె చెప్పినట్లే చేసింది. ఈశ్వరమ్మ ఆమె మీద పసుపు నీళ్ళు చల్లి, మంచి నిమ్మకాయను ఆమె చుట్టూ తిప్పి, తరువాత దాన్ని రెండుగా కోసి ఆమెకు ఆ వైపూ ఈవైపూ పెట్టి, కళ్ళు మూసుకొని రెండు నిముషాలు ఏవో

గొణిగింది. తరువాత ఆ వస్తువులన్నీ పళ్ళెంలో పెట్టుకొని వెళ్ళి పెరట్లో పారనేసింది.

ఇంతలో సుధాకర్ వచ్చాడు. అరుణను దగ్గరకు తీసుకొని తనే ఆమెనోట్లో టాబ్లెట్‌వేసి కాఫీ త్రాగించాడు. ఆమెకు టాబ్లెట్ కంటే సుధాకర్ వెచ్చని గుండెల్లో అతని బలమయిన బాహువుల మధ్య సేద దీరడంతో తలనొప్పి ఎగిరిపోయింది. ఈ తలనొప్పికి కారణం తనను అత్తగారన్న మాటలని అతనికి చెప్పలేదు.

"ఛ...నా మూలంగా మీ సినిమా ప్రోగ్రాం కాన్సిలయింది. అయామ్‌సారీ" అంది అరుణ.

"ఏయ్ అరుణా ఏమిటా మాటలు. నా సినిమా ప్రోగ్రాం ఏమిటి? మన సినిమా ప్రోగ్రాం. ఇద్దరికి బాగుంటేనే ఆనందంగా చూస్తాం. ఈరోజు కాకపోతే రేపు వెల్దాం" అంటూ జేబులోంచి టికెట్లు తీసి చించి పారేసాడు.

"అలా పైకివెళ్ళి మేడమీద కూర్చొందాంరా. ఫ్రెష్‌గా గాలి వస్తుంది" అంటూ లేచాడు. ఇద్దరూ వరండాలోకొచ్చి మేడ మెట్లెక్క సాగారు.

"ఇప్పుడెలా ఉందమ్మా" అడిగింది ఈశ్వరమ్మ.

అరుణ మౌనంగా ఉంది.

"తలనొప్పి తగ్గిపోయిందమ్మా. ఇప్పుడు హాయిగా నవ్వుతోంది" అన్నాడు సుధాకర్.

"అవున్రా నాయనా. అదంతా దిష్టిరా. పచ్చగా కళకళ లాడుతూ తలనిండా మల్లెపూలతో లక్ష్మీ దేవిలా వుంటే ఎవరికళ్ళోపడి ఉంటాయిరా.

అందరి కళ్ళూ ఒకలాగా ఉండవునాయనా. దిష్టికళ్ళు వుంటాయి. దిష్టి తీయబట్టే తగ్గిపోయింది."

మేడమీద కుర్చీల్లో ఒకరి కెదురుగా మరొకరు కూర్చున్న తరువాత ముందుకు వంగి భార్య ముఖాన్ని తన రెండు చేతుల్లోకి తీసుకొని అన్నాడు.

"చివరకు అమ్మకు నేను పరాయివాడ్నయిపోతానేమో. ఇప్పటికే ఆమె నిన్ను స్వంత కూతురు కంటే ఎక్కువగా చూస్తోంది."

అరుణ నవ్వలేక నవ్వింది.

"కాకపోతే చూడు! అమ్మ చెప్పడం. నీవు మహాలక్ష్మిలా ఉన్నావట. నీకు దిష్టి తగిలిందట. ఎలా బాధపడుతుందో చూడు నీ గురించి" అన్నాడు.

అరుణ ఏదో ఆలోచిస్తోంది. తన అత్త, మామ మంచివాళ్ళే. తనంటే ప్రేమ వుంది, కాని వాళ్ళ మూఢనమ్మకాలతో అందరి మతులూ పోగొడుతున్నారు. అందుకే వాళ్ళతో కఠినంగానైనా ప్రవర్తించి వాళ్ళ ఆచార వ్యవహారాలలో మార్పు తేవాలి అనుకొంది. ఉదయం కాఫీ మానేయడం మంచిదే కనుక ఆ అలవాటును తిరగదోడదలచుకోలేదు.

ఒకరోజు సుధాకర్ ఆఫీసుకు బయలుదేరుతుంటే శరభయ్య తుమ్మేడు.

"నాయనా ఓ అయిదు నిముషాలు కూర్చొనిపో" అంది వెనుక నుంచి తల్లి.

సుధాకర్ ఆగాడు.

"ఆ...అవన్నీ మీరు పట్టించుకోకండి ఇలా తుమ్ముల్ని పట్టించు

కొంటూ పోతే ఈ పట్టణం మొత్తం మీద నిమిషానికొకరు ఎక్కడో ఒక చోట తుమ్ముతూనే వుంటారు ఇక మనం ఎక్కడికి వెళ్ళగలం అవన్నీ పట్టించుకోకుండా మీరు ఆఫీసుకు వెళ్ళండి" అంది అత్తగారి మాటల్ని తీసి పడేస్తూ.

ఈశ్వరమ్మ కోపంగా చూస్తూ "ఒరే నువ్వు నా మాట విని ఓ అయిదు నిముషాలు కూర్చొనిపోరా" అంది.

శరభయ్య వాళ్ళ ముగ్గుర్నీ గమనిస్తూ మౌనంగా వుండిపోయాడు.

సుధాకర్ ఏం చేయడానికి పాలుబోక ఓ అయిదు నిముషాలు ఎటో చూస్తూ నిలబడి, తరువాత స్కూటర్ని వీధిలోకి నెట్టుకుపోయి, స్టార్టు చేసుకొని వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం ఇంటి ముందు దిగి స్కూటర్ని నెట్టుకుంటూ కుంటుతూ లోపలికి వస్తున్న సుధాకర్ని చూసి కంగారు పడింది అరుణ

"ఏమైందండీ" అంది భయంగా.

"జస్ట్ కాలు కొద్దిగా గీచుకొంది. నువ్వేం కంగారు పడకు" అన్నాడు సుధాకర్. స్కూటర్ని వరండాలో ఉంచి స్టాండు వేసాడు.

లోపల నుంచి వచ్చిన ఈశ్వరమ్మ ఏడుపు మొదలుపెట్టింది. "నేను చెబుతూనే ఉన్నానురా నాయనా. తుమ్మినపుడు కూర్చొని వెళ్లంటే ఇది జరిగేది కాదురా."

"నువ్వూరుకో అమ్మా" అంటూ తల్లిని మందలించింది. ఏదో ఆలోచిస్తున్న అరుణను "పద పద" అంటూ గదిలోకి తీసుకు వెళ్ళాడు. లోపలకు వెళ్ళిన తర్వాత ఆమె ఆ బాండేజి ఊడతీసి సుధాకర్ తెచ్చిన ఆయింట్‌మెంట్ పూసి ఫ్రెష్‌గా మరలా బాండేజి కట్టింది.

ఆ రాత్రి ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్న అరుణతో "మా అమ్మకు నమ్మకాలు ఎక్కువ. నువ్వవేమీ పట్టించుకోకు" అన్నాడు.

"అవన్నీ సరేగాని మీకింతకుముందు ఎప్పుడైనా స్కూటరు మీద ఇటువంటి చిన్న చిన్న దెబ్బలు తగిలాయా" అని అడిగింది.

"ఓ యబ్బో! ఎన్నోసార్లు"

"అయితే అప్పుడు ప్రతిసారి ఎవరు ఒకరు తుమ్మేవాళ్ళా"

"అవన్నీ ఎవడు గమనించాడు. అప్పుడు నువ్వు ఉదయం జరిగిన సంఘటన గురించే ఆలోచిస్తున్నట్లున్నావు. అమ్మ వద్దన్నా ఆ మాట విని వెళ్ళకనే ఇది జరిగిందని అనుకొంటున్నావా. నేను అమ్మ మీద ప్రేమతో ఆమె మాటల్ని గౌరవిస్తున్నాను తప్ప, నాకే మూఢ నమ్మకాలూ లేవు. ఇక ఆలోచించక నా కళ్ళలో కళ్ళు కలిపి చూడు" అన్నాడు సుధాకర్ ఆమెను నవ్వించడానికి ప్రయత్నిస్తూ.

రోజులు గడుస్తున్నాయి.

ఒకరోజు భార్యా, భర్తా సినిమాకు వెళుతోంటే పిల్లి ఎదురు వచ్చింది. ససేమిరా పోవడానికి వీల్లేదంది ఈశ్వరమ్మ. ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్ళాల్సిందేనని అరుణ పట్టుపట్టి వెళ్ళింది. వీళ్ళు వెళ్ళిన సినిమా ఆట మధ్యలో క్రింద తరగతి వారికి హాలు మేనేజ్‌మెంటు వారికి ఘర్షణ జరిగి అది కొట్లాటగా మారి హాలు చుట్టూ కర్ఫ్యూ పెట్టేంత వరకూ వచ్చింది. సగం సినిమా చూసి బయపడ్డారు సుధాకర్ అరుణ.

మరుసటి రోజు వాళ్ళ ద్వారా వీళ్ళ ద్వారా విషయం విని గోల చేసింది ఈశ్వరమ్మ. ఇదంతా పిల్లి శకునమంది ఇప్పటికైనా తన మాట వినండని ఏడ్చింది. కాని అరుణ ఆమె మాటల్ని పెడచెవిన పెట్టింది.

సుధాకర్ మాత్రం వాళ్ళిద్దరి మధ్యా అడకత్తెరలో పోకలా నలిగి పోతున్నాడు.

ఇంకో రోజున సుధాకర్ బయలుదేరే సమయానికి ప్రక్కింటి సుబ్బమ్మ ఏదో పనిమీద వీళ్ళింటికి వచ్చింది. సుబ్బమ్మ విధవరాలు సుబ్బమ్మ ఏదో చెప్పబోతున్నా వినిపించుకోకుండా శకునం మంచిది కాదని కొడుకుని ఇంట్లోకి వెళ్ళి కొద్దిసేపు కూర్చుని వెళ్ళమంది. సుబ్బమ్మ ముందే ఆ మాట చెప్పటం అరుణకు చాలా బాధనిపించింది. దాంతోపాటు కోపం కూడా వచ్చింది. శకునం చాలా మంచిదని, వెళ్ళం డని భర్తతో గట్టిగా అనడంతో సుధాకర్‌కు వెళ్ళకతప్పింది కాదు. ఈశ్వ రమ్మ ముఖం నల్లగా మాడిపోతే, అవమాన భారంతో భూమి వేపు తల దించుకుపోయి ఉన్న సుబ్బమ్మ ముఖంలో వెలుగు కనబడింది.

అయితే ఆ రోజు సాయంత్రం ముఖం వేళ్ళాడేసుకొని వచ్చి దిగు లుగా కూర్చొన్న సుధాకర్‌ని చూసి మళ్ళీ ఏమొచ్చిందోనని భయపడి పోయింది అరుణ. సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ ఫిట్ లిస్టులో తన పేరుకు బదులు తనకంటే ఎంతో జూనియర్ అయిన ఇంకొకడిని చేర్చా రని, ఇది తనకెంతో అవమానంగా ఉందని బాధపడ్డాడు. చెవులు విప్పు కొని వింటున్న ఈశ్వరమ్మ దీనికంతటికీ కారణం తెలివి తక్కువగా తన కుమారుడికి ఉదయం ఎదురొచ్చిన విధవ సుబ్బమ్మేనని ఆమెను నానా రకాలుగా తిట్టసాగింది. అయితే అరుణ ఈ విషయంలో బాధ పడవద్దని తనను సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ లిస్టులో చేర్చమని పై ఆఫీసరుకు అప్పీలు చేసుకొంటే సరిపోతుందని భర్తని అనునయించింది.

అన్నీ ఆలోచించి ఆ మరుసటి రోజు నుంచి ఈశ్వరమ్మ కొడుకు ఆఫీసుకు బయలుదేరే సమయానికి తనే ముఖాన కాసంత కుంకుమ బొట్టు పెట్టుకొని ఎదురు వచ్చేది. కోడలికి చెబితే తన మాట ఖాతరు చేయదని

ఆమె అనుమానం. అమెకు చెప్పి తిరస్కారం పొందేకంటే తనే ఎదురు వస్తే మంచిది అనుకొంది.

రోజులు గడచిపోతున్నాయి.

ఆ రోజు ఎప్పటిలాగే కొడుకు బయలు దేరుతుంటే ఎదురొచ్చి 'జాగ్రత్తగా వెళ్ళిరా నాయనా' అని చెప్పింది. సుధాకర్ వెళ్ళిన అర గంటకు అతని ఆఫీసుకు సంబంధించిన ఒక వ్యక్తి పరుగెత్తుకు వచ్చి స్కూటర్‌కి ఏక్సిడెంటు అయిందని, సుధాకర్‌ని హాస్పిటల్‌లో చేర్చారని చెప్పి వచ్చినంత హడావుడిగా వెళ్ళిపోయాడు. ఈశ్వరమ్మ కుప్పకూలి పోయింది అరుణ కన్నీళ్ళు కాలువలుగా మారాయి పక్కింటి పిల్లవాడ్ని మామగారి వద్దకు పంపి, తను అత్తగార్ని తీసుకొని రోడ్డు మీదికి వచ్చి ఆటోలో హాస్పిటల్ చేరింది.

శరీరమంతా బాండేజితో బెడ్ మీద పడి వున్నాడు సుధాకర్. గది గుమ్మం ముందున్న స్టాపు వీళ్ళను చూసి తొలిగారు. అరుణ అతని ముఖం తడుముతూ కళ్ళనీళ్ళు పెట్టుకొంది ఈశ్వరమ్మ అయితే సరేసరి. పెద్దగా శోకాలు పెట్టసాగింది.

హాస్పిటల్ స్టాఫ్ ఆమెను ఏడవకుండా ఆపి సుధాకర్‌కు అవసర మైన రక్తం కోసం ప్రయత్నం చేయసాగారు. బ్లడ్ బ్యాంక్‌లో ఆ గ్రూపు రక్తం అయిపోయింది అక్కడ ఉన్నవాళ్ళ రక్తం ఎవరిదీ సూటు కాలేదు ఈశ్వరమ్మ రక్తం సరిపడినా ఆమె బలహీనంగా ఉందన్నారు. అరుణ రక్తం పరీక్ష చేసి సూటవుతుందని అన్నారు. అయితే తీసుకోవ దానికి సందిగ్ధంగా ఉన్నారు.

ఆమె ఒట్టి మనిషి కాదు. గర్భవతి. అందుకే ఆలోచిస్తున్నాను" అంది లేడి డాక్టరు

ఆ మాటలకు ఈశ్వరమ్మకు ఒక వేపు చెప్పలేని ఆనందం, ఇంకో వేపు కొడుకు పరిస్థితికి చెప్పలేని విచారం.

"ఫరవాలేదు డాక్టర్. ముందు నా రక్తం తీసి ఆయన్ని బ్రతికించండి. నా సంగతి తరువాత చూసుకోవచ్చు" అంది అరుణ స్థిరంగా

ఈశ్వరమ్మ "నాయనా! ఇంకెక్కడా ఈ గ్రూపు రక్తం దొరకదా" అంది విచారంగా. ఆమెకు కొడుకుతోబాటు కొడుకు సంతానమూ తనకు దక్కాలని ఉంది.

"అత్తయ్యా! బాధపడకు. నాకేమీ కాదు. ఇప్పటి వరకు మా మనసులు కలిసినా మా శరీరాలు వేరు. ఇప్పుడు ఆయన జీవకణాలు నా రక్తంతో నా శరీరంలో పెరుగుతున్నాయి. ఇప్పుడు నా రక్తం ఆయన శరీరంలో కలిస్తే ఆయనలో నేను వుంటాను. ఒకవేళ ఎప్పటికయినా నేను పోయినా ఆయన రక్తంలో కలిసి బ్రతికే ఉంటాను..." కోడలు మాటలకు చప్పున నోరు మూసింది ఈశ్వరమ్మ.

కొద్ది సేపట్లోనే అరుణ రక్తం సుధాకర్‌కి ఎక్కించారు. గదిలో సుధాకర్ శరీరం మీద చిన్న చిన్న ఆపరేషన్‌లు జరుగుతున్నాయి. గది బయట నీరసంగా బెంచి మీద కూర్చొని ఉన్న కోడలు తల నిమిరింది ఈశ్వరమ్మ.

"అమ్మా! నా మూఢ నమ్మకాలకు ఈరోజు స్వస్తి చెబుతున్నాను. నేను ఈ రోజు అబ్బాయికి ఎదురు రావడంవల్లనే కదా ఇది జరిగింది" అంది ఏడుస్తూ.

"అత్తయ్యా ఆయనకు ఈ ఏక్సిడెంటు జరగడానికి కారణం లారీవాడు త్రాగి ఉండడం. ఇక ఆచారాలు, నమ్మకాల విషయానికొస్తే

ఎవరి నమ్మకాలు వాళ్ళవి. ఆచారాలు చెప్పేది శుచి, శుభ్రత పాటించి మాత్రమే. నేను ఆత్మ విశ్వాసాన్ని నమ్ముకొంటే, మీరు ఏవో శకునాలను నమ్ముతారు నేను దేవుడు లేడనే నాస్తికురాలిని కాదు. అలాగని దేవుడున్నాడని గంటకొకసారి పూజచేసే ఆస్తికురాలినీకాదు. అసలు దేవుళ్ళంటే ఎవరు? మంచి పనులు చేసిన మహాపురుషులు. దేవుళ్ళు చెప్పేది తమను మూర్ఖంగా పూజించమని కాదు. తమను ఆదర్శంగా తీసికొని మంచిపనులు చేయమని. అయినా అత్తయ్యా మీరు ఎదురు రాబట్టే నా భర్త నాకు ప్రాణాలతో దక్కాడని నమ్ముతున్నాను" అంది పైట చెంగుతో కన్నీళ్ళు అద్దుకొని.

ఈశ్వరమ్మకు తెలుసు ఈ ఆఖరిమాట తను ఎక్కడ నొచ్చుకొంటుందోనని తన తృప్తికోసం కోడలు అన్నదని ఆమెకిప్పుడు ఆచారాల వెనుక నున్న ఆంతర్యం అర్థమయింది.

"అమ్మా, ఇకనించి నీ మాట ఏదీ కాదనను" అంది ఎంతో తృప్తిగా.

ఇంతలో సుధాకర్ కళ్ళు తెరిచాడని నర్సు వచ్చి చెప్పేసరికి ఇద్దరూ గదిలోకి వెళ్ళారు. వీళ్ళను చూసి అంతబాధలోనూ చిరునవ్వు నవ్వాడు సుధాకర్.

ఆ నవ్వు అత్తా, కోడళ్ళ హృదయాలలో పన్నీటి జల్లు కురిపించింది.

*